AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN

## జేఈఈ మెయిన్స్ ఫలితాలు వాయిదా


**అక్షరటుడే, ఎడ్యుకేషన్ డెస్క్ :** జేఈఈ మెయిన్స్ ఫలితాలపై ఎన్‌టీఏ గురువారం కీలక ప్రకటన చేసింది. ఈ రోజు విడుదల కావాల్సిన ఫలితాలను వాయిదా వేసినట్లు తెలిపింది. ఈ నెల 16న రిజల్ట్స్ రిలీజ్ చేస్తామని చెప్పింది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ప్రతి సంవత్సరం జేఈఈ పరీక్షలు రాస్తారు. ఐఐటీ, ఎన్ఐటీ వంటి ప్రముఖ కాలేజీల్లో సీట్ల కోసం జేఈఈ పరీక్షలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా జేఈఈ సెషన్-1 పరీక్షలు జనవరి 21, 22, 23, 24, 28, 29 తేదీల్లో జరిగాయి. ఫలితాల కోసం విద్యార్థులు ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 12లోపు ఫలితాలు విడుదల కావాల్సి ఉంది. దీంతో బుధవారం సాయంత్రం లేదా గురువారం రిజల్ట్స్ వస్తాయని విద్యార్థులు నిరీక్షిస్తున్నారు.

## 3వ తరగతి నుంచే విద్యార్థులకు ఏఐ యాక్సెస్

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాల్లో కృత్రిమ మేధ (ఏఐ) విస్తరిస్తోంది. ఈ కొత్త ఏఐ విధానాన్ని భారత్‌లోని విద్యార్థులందరికీ చేరువ చేస్తామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. దేశంలో 30 కోట్ల మంది విద్యార్థులు ఉన్నారన్నారు. 3వ తరగతి నుంచే కృత్రిమ మేధ అందుబాటులో ఉంటుందన్నారు. గురువారం దిల్లీలో జరిగిన ఏఐ కాంక్లేవ్2026 సదస్సులో ఆయన మాట్లాడారు. ఏఐ (AI) రంగంలో భారత్ అభివృద్ధి చెందుతుందన్నారు. ఇక్కడ మేధో సామర్థ్యానికి లోటు లేదని, కృత్రిమ మేధకు సంబంధించి పలు పరిశోధనలు జరుగుతున్నాయని వెల్లడించారు. భారత్‌లో గణనీయమైన యువశక్తి ఉందన్నారు.

12-2-2026 (Thursday) MAIN EDITION

## పవన్‌కల్యాణ్‌తో బాలకృష్ణ భేటీ



**అక్షరటుడే, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు బాలకృష్ణ భేటీ అయ్యారు. అసెంబ్లీలోని పవన్ ఛాంబర్‌లో ఆయనను కలిశారు. హిందూపురం నియోజకవర్గ సమస్యలపై ఆయనతో చర్చించారు. పవన్ కల్యాణ్‌ను ఆయన సోదరుడు, ఎమ్మెల్సీ నాగబాబు కూడా కలిశారు.

## జీపీలకు రెండో విడత నిధులు విడుదల



**అక్షరటుడే, హైదరాబాద్:** గ్రామ పంచాయతీలకు ఆర్థిక సంఘం మరోసారి నిధులు విడుదల చేసింది. తొలి విడతలో భాగంగా రాష్ట్రానికి రూ.259.36 కోట్లు రాగా.. తాజాగా రూ.387 కోట్ల నిధులు విడుదలయ్యాయి. దీంతో ఇప్పటి వరకు రూ.646.46 కోట్లు విడుదలైనట్లయింది. గ్రామపంచాయతీలకు ఇంకా రూ.2,400 కోట్లు కేంద్రం నుంచి రావాల్సి ఉంది.

## బ్రిటిష్ పార్లమెంట్‌లో తెలంగాణ బిడ్డ



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బ్రిటిష్ పార్లమెంట్ ఎగువసభ 'హౌస్ ఆఫ్ లార్డ్స్ 'లో తెలంగాణ బిడ్డ ఉదయ్ నాగరాజు లైఫ్ పీర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. బ్రిటిష్ సంప్రదాయాల మేరకు బుధవారం జరిగిన వేడుకలో భగవద్గీతపై నాగరాజు ప్రమాణం చేశారు. సిద్దిపేట జిల్లాకు చెందిన ఉదయ్ నాగరాజు.. దాదాపు 25 ఏళ్ల క్రితం బ్రిటన్ వెళ్లారు.



## శ్రీలంక ఘన విజయం

**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** టీ 20 వరల్డ్ కప్‌లో శ్రీలంక ఘన విజయం సాధించింది. ఓమన్‌తో జరిగిన మ్యాచ్‌లో 105 పరుగుల తేడాతో గెలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 225 పరుగులు చేసింది. కుశాల్ మెండిస్ 61, పవన్ రత్నాయకే 60, శనక 50 పరుగులతో రాణించారు. 226 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఓమన్ జట్టు ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 120 పరుగులు మాత్రమే చేసింది.

## బైక్ షోరూమ్‌లో అగ్ని ప్రమాదం..

**అక్షరటుడే, హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో అగ్ని ప్రమాదాలు కలవర పెడుతున్నాయి. తాజాగా కూకట్‌పల్లిలోని ఓ బైక్ షోరూంలో మంటలు అంటుకున్నాయి. కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధి సాయినగర్ హీరో షోరూంలో ప్రమాదం చోటు చేసుకుంది. గురువారం ఉదయం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేశారు.

**ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ లోక్‌సభలో చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా బుధవారం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీపై ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. అమెరికాతో వాణిజ్య ఒప్పందంలో జాతీయ ప్రయోజనాలను కేంద్ర ప్రభుత్వం రాజీపడిందని రాహుల్ అన్నారు. భారత్ ఇంధనం ఎక్కడ కొనాలో అమెరికా చెప్పడం ఏంటని ప్రశ్నించారు. దేశ ప్రయోజనాలతో రాజీ పడినందుకు ప్రభుత్వం సిగ్గుపడాలి అని విమర్శించారు. అయితే సభలో నిరాధర ఆరోపణలు చేశారని ఆయనపై కేంద్రం ఆగ్రహం వ్యక్తం చేసింది.**

– అక్షరటుడే, హైదరాబాద్

# రాహుల్ గాంధీపై వేటు!



- సభ్యత్వం రద్దు చేయాలని తీర్మానం
- సబ్‌స్టాంటివ్ మోషన్ ప్రవేశ పెట్టిన బీజేపీ ఎంపీ దూబే
- ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధించాలని డిమాండ్

రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు మండిపడ్డారు. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరన్ రిజిజు మాట్లాడుతూ సభను తప్పుదారి పట్టించినందుకు, నిరాధార ప్రకటనలు చేసినందుకు రాహుల్ గాంధీపై బీజేపీ ఎంపీలు ప్రత్యేక హక్కుల ఉల్లంఘన నోటీసును దాఖలు చేస్తారని చెప్పారు. ఈ క్రమంలో గురువారం ఆయనపై బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే సబ్‌స్టాంటివ్ మోషన్ ప్రవేశ పెట్టారు. దూబే మాట్లాడుతూ.. రాహుల్ గాంధీపై ప్రివిలేజ్ మోషన్ ప్రవేశపెట్టే ఆలోచన లేదన్నారు. అయితే ఆయన పార్లమెంటు సభ్యత్వాన్ని నిలిపివేయాలని కోరారు. ఈ మేరకు సబ్‌స్టాంటివ్ మోషన్ ప్రవేశ పెట్టారు.

### నిషేధం విధించాలి

దూబే మాట్లాడుతూ.. సోరోస్ ఫౌండేషన్, ఫోర్డ్ ఫౌండేషన్, యూఎస్ఏఐడీతో రాహుల్ గాంధీకి ఎలాంటి సంబంధాలు ఉన్నాయో చర్చించాలన్నారు. థాయిలాండ్, కంబోడియా, వియత్నాం, యూఎస్ వంటి ప్రదేశాలకు ఎలా ప్రయాణిస్తున్నారో మరియు ఆయనకు భారత వ్యతిరేక శక్తులతో ఎలాంటి సంబంధం ఉందో అనే అంశంపై నోటీసుల్లో పేర్కొన్నట్లు తెలిపారు. రాహుల్ గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, జీవితాంతం ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించాలని డిమాండ్ చేశారు. సబ్‌స్టాంటివ్ మోషన్ అనేది సభ పరిశీలన కోసం ఒక సభ్యుడు చేసే అధికారిక ప్రతిపాదన.



## రక్షణ మంత్రిని కలిసిన సీఎం రేవంత్‌రెడ్డి

**అక్షరటుడే, హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో పర్యటిస్తున్నారు. బుధవారం కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడిని కలిసిన ఆయన గురువారం పలువురు కేంద్ర మంత్రులను కలవనున్నారు. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను సీఎం కలిశారు. ప్రతిష్ఠాత్మకమైన మూసీ నది పునరుజ్జీవ పథకంలో భాగంగా చేపట్టనున్న గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ గురించి ఆయనతో చర్చించారు. ఫిబ్రవరి చివరి వారంలో గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరు కావాలని ముఖ్యమంత్రి రక్షణ మంత్రిని ఆహ్వానించారు. ఎసా, మూసీ నదుల పవిత్ర సంగమం వద్ద ఈ కార్యక్రమం జరుగుతుందని ముఖ్యమంత్రి వివరించారు. ఫిబ్రవరి 1948లో మహాత్మా గాంధీ చితాభస్మాన్ని ఈ చారిత్రాత్మక సంగమం వద్ద నిమజ్జనం చేశారని తెలిపారు. ఈ ప్రదేశం జాతీయ ప్రాముఖ్యత కలిగినదిగా మారిందని ఆయన కేంద్ర మంత్రికి తెలియజేశారు.

## కాంగ్రెస్, బీజేపీ ఒకటే : కేటీఆర్



**అక్షరటుడే, హైదరాబాద్ :** కాంగ్రెస్, బీజేపీ ఒకటేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన పలువురు గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ తెలంగాణకు చేసిందేమీ లేదన్నారు. అబద్ధపు హామీలిచ్చి అరచేతిలో వైకుంఠం చూపి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 12 ఏళ్లుగా తెలంగాణకు 12 పైసల పని కూడా చేయలేదని ఆరోపించారు. స్వార్థ ప్రయోజనాల కోసం కొందరు పార్టీని వదిలి వెళ్లిపోయినా.. కార్యకర్తలు మాత్రం కేసీఆర్ వెంటే ఉన్నారని చెప్పారు. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## 62 సార్లు ఢిల్లీకి వెళ్లిన సీఎం ఏం సాధించారు : హరీశ్‌రావు



**అక్షరటుడే, హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకుల పాఠశాలల విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే పట్టించుకోవడం లేదన్నారు. కాగా.. కల్తీ ఆహారం మాకొద్దు అంటూ సంగారెడ్డి జిల్లా నారాయణ్ ఖేడ్ మండలం ఎస్టీ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ధర్నా చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో భోజనం బాగుంటడం లేదని విద్యార్థులు నిరసన తెలిపారు. ఈ ఘటనపై హరీశ్ రావు 'ఎక్స్' వేదికగా స్పందించారు. నిత్యం ఇలాంటి ఘటనలు జరుగుతున్నా.. విద్యాశాఖ మంత్రిగా ఉన్న సీఎం పట్టించుకోవడం లేదన్నారు. నిత్యం గాలి మోటార్లలో చక్కర్లు కొట్టే ముఖ్యమంత్రికి గురుకులాల్లో నెలకొన్న అధ్వాన పరిస్థితులపై సమీక్షించే తీరిక లేకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. 62 సార్లు ఢిల్లీకి వెళ్లిన సీఎం రాష్ట్రానికి ఏం తెచ్చారని ప్రశ్నించారు. కమీషన్ల కోసం ఆ స్కూళ్లు ఉస్మానియాకు వెళ్లి రిబ్బన్లు కట్ చేయడం తప్ప రెండున్నరేళ్లుగా సీఎం చేసిన అభివృద్ధి ఏముందని మాజీ మంత్రి ప్రశ్నించారు. ఇప్పటికైనా విద్యాశాఖ మీద దృష్టి సారించి, గురుకుల విద్యార్థులకు పురుగుల్లేని భోజనం అందించాలని డిమాండ్ చేశారు.

## అమెరికాలో తెలుగు విద్యార్థి మృతి.. రూ.262 కోట్ల పరిహారం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికాలో మృతి చెందిన తెలుగు విద్యార్థి కుటుంబానికి రూ.262 కోట్ల పరిహారం చెల్లించడానికి సియాటెల్ అంగీకరించింది. ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రకటించింది. ఏపీలోకి కర్నూల్ జిల్లాకు చెందిన కందుల జాహ్నవి ఉన్నత విద్య కోసం 2021లో అమెరికాకు వెళ్లింది. సౌత్ లేక్ యూనియన్‌లోని నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీలో ఎంఎస్‌లో చేరింది. అయితే 2023 జనవరి 23న రాత్రి ఆమె రోడ్డు దాటుతుండగా పోలీస్ పెట్రోలింగ్ వాహనం ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన జాహ్నవి అక్కడిక్కడే మృతి చెందింది. అయితే పెట్రోలింగ్ కారు నడిపిన పోలీసు అధికారి కెవిన్ డవే నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగింది. ఈ కేసు విచారణలో భాగంగా జాహ్నవి కుటుంబానికి 29 మిలియన్ డాలర్ల (రూ.262 కోట్లు) పరిహారం ఇవ్వడానికి సియాటెల్ ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు సిటీ అటార్నీ ఎరికా ఇవాన్స్ ప్రకటన విడుదల చేశారు.

## స్టైలిష్ లుక్‌లో నిఖిత దత్తా



**బాలీవుడ్ నటి తన ఫొటోలతో సోషల్ మీడియాలో సంచలనం సృష్టించింది. లస్ట్ స్టోరీస్, కబీర్ సింగ్, రాకెట్ గ్యాంగ్ వంటి సినిమాల్లో సందడి చేసిన నిఖిత తాజాగా సోషల్ మీడియాలో కొన్ని చిత్రాలను షేర్ చేసింది. బికిని, తెల్లటి ఓవర్‌కోట్‌తో బీచ్‌లో ఫొటోలను అభిమానులతో పంచుకుంది. ఆమె నటిస్తున్న 'గుల్ గులే బకావాలి' సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సినిమాతో ఈ ముద్దుగుమ్మ తెలుగులో అరంగేట్రం చేయనుంది.**

– అక్షరటుడే, సినిమాడెస్క్

## విమానానికి బాంబు బెదిరింపులు

**అక్షరటుడే, హైదరాబాద్:** విమానానికి బాంబు బెదిరింపులు కలకలం రేపాయి. బెహరాన్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వచ్చిన గల్ఫ్ ఎయిర్‌లైన్స్ విమానానికి బాంబు బెదిరింపు వచ్చింది. దేశంలో బాంబు బెదిరింపులు ఆగడం లేదు. విమానాలు, రైల్వే స్టేషన్లు, పాఠశాలల్లో బాంబులు పెట్టినట్లు గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్లు చేస్తున్నారు. పలువురు మెయిల్స్ పంపుతున్నారు. దీంతో అధికారులు తనిఖీలు చేపడుతున్నారు. తాజాగా గల్ఫ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానానికి బాంబు బెదిరింపులు రావడంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. విమానాన్ని పైలెట్ ఎయిర్‌పోర్ట్‌లో సురక్షితంగా ల్యాండింగ్ చేశారు. అనంతరం ప్రయాణికులను ఐసోలేషన్ ప్రాంతానికి తరలించారు. విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయగా.. ఎలాంటి బాంబు లేదని తేలడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. నకిలీ బెదిరింపుగా గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.